

# రారండోయ్.. వేడుక చూద్దాం



- రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఆలయాల్లో అన్నదానాలు
- తరలిరానున్న భక్తజనం
- నేడు శ్రీరామనవమి

రాములోరి ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. విద్యుద్దీపాలు, పెళ్లి పందిరిలు, మామిడి తోరణాలు, పూలతో అలంకరణలు ఇలా ఒకటేమిటి భక్తుల కళ్లు చెమ్మగిల్లేలా అంతటా ప్రత్యేక ఏర్పాట్లతో కనువిందు చేస్తున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేలా రెండు రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేశారు. వేల సంఖ్యలో భక్తులు హాజరుకానుండడంతో ఎలాంటి లోటు ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు ఆలయ అధికారులు.

7



వెల్గనూర్‌లో ముస్తాబైన ఆలయం

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



మల్లిడిలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

భీమిని, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం మండలంలోని మల్లిడి గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేశారు. ముందుగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూపాయలు 90 లక్షలతో నిర్మించిన భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం రైతువేదిక వద్ద మండలానికి చెందిన 24 మందికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పథకాలలో ఒకటి ఇందిరమ్మ ఇళ్లని ఇంటి స్థలం ఉన్న వారికి నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా రూపాయలు 5 లక్షలు అందిస్తుందన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిచామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాధవరపు నర్సింగరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సంగర్సు రవీందర్‌రావు, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్, నాయకులు కర్నె శ్రీనివాస్, పత్తిపాక జగదీష్, శ్రీనివాస్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

## పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ



కిష్టంపేటలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సన్నబియ్యం అందించాలనే ఉద్దేశ్యంతో రేషన్ షాపుల ద్వారా పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రేషన్ షాపుల్లో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, అంకాగౌడ్, బాపగౌడ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

మందమర్రిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3వ జోన్‌కు చెందిన అఖిలేష్ కుటుంబానికి శనివారం యూత్‌ఫర్ సొసైటి నాయకులు రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల అఖిలేష్ శ్రీరాంపూర్‌లోని కళాశాలకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్సకు డబ్బులు లేకపోవడంతో ఆర్థిక సహాయం అందించినట్లు సొసైటీ నాయకులు తెలిపారు. మంద తిరుమల్, రాయబారపు కిరణ్, రవి, ఉదయ్ ఉన్నారు.

## నేత్ర వైద్య శిబిరానికి స్పందన

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 54 మందికి ఉచిత కంటి చికిత్సలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ మంచిర్యాల లయన్స్ క్లబ్ గోల్డెన్ జుబ్లీ సంయుక్తంగా నిర్వహించిన శస్త్ర చికిత్సకు రేకుర్తి కరీంనగర్ ఆస్పత్రిలో 54 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. మంచిర్యాల అధ్యక్షులు లయన్ బాలమోహన్, గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు రాకేశ్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కుల వృత్తుల వారికి నిధులు విడుదల చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తులు చేసుకుని జీవించే వారికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీసీ కులాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు



బొప్పారంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

**మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా**

**ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి**

కోటపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని బొప్పారం గ్రామం ఎంపిక కాగా శని వారం కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, ఇతర హామీలను నెరవేరుస్తుందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. నక్కలపల్లి దారిలో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే అటవీ శాఖ అనుమతులు తీసుకువచ్చి నిర్మాణం చేపడతామన్నారు. బావనపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను త్వరలోనే తీరుస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన బొప్పారం గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అంతకుముందు కోటపల్లి మండల కేంద్రంలో డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టే సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. నక్కలపల్లిలో అటవీ కుక్కల దాడిలో మేకలు మృతిచెందిన ఘటనలో బాధితుడైన ముల్కల్ల వెంకటికి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 6 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. బొప్పారంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పోటు రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాపురెడ్డి, తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు మహేష్ ప్రసాద్‌తివారీ, భూషణ్‌శర్మ, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకం మాది.. కాదు మాది

**బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం**



రేషన్ షాపు వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రేషన్ దుకాణం వద్ద సన్నబియ్యం పంపిణీ సందర్భంగా శనివారం బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు ప్రతి రేషన్ షాపు వద్ద దేశ ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో కిష్టంపేటలోని రేషన్‌షాపు వద్ద మోదీ ఫ్లెక్సీకి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రధాని ఫ్లెక్సీని తొలగించారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పడంతో శాంతించారు.

## ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు అన్నారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను దేశంలో అమలు చేస్తే కార్మికుల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. వేతనం అడుగరాదని, సమ్మె చేయరాదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికవర్గం, ప్రజానీకం కోసం యువత, మేధావులు, సామాజిక సంఘాల నాయకులు ముందుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు జి. ప్రకాష్, దాసరి రాజేశ్వరి, సహాయ కార్యదర్శులు దూలం శ్రీనివాస్, భానుమతి, జిల్లా కమిటీ సభ్యులు సమ్మక్క, శోభ, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

లక్సెట్టిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని మొదెలలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ అవగాహన ర్యాలీని కాంగ్రెస్ నాయకులు శనివారం నిర్వహించారు. మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం మాట్లాడుతూ స్వాతంత్ర భారత దేశాన్ని, రాజ్యాంగంను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది అన్నారు. అనంతరం నాయకులతో రాజ్యాంగంను కాపాడుకునేందుకు ప్రతిజ్ఞ చేసారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆరీఫ్, తోట రమేష్, చింత అశోక్, గోప రమేష్, రాందేని చిన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్

**కలెక్టర్ కుమార్ దీపక్**





బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బహుజన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆయన జీవితం అందరికి ఆదర్శనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన సమావేశ మందిరంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, దళితుల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పోటు రవీందర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, కిసన్, రౌఫ్‌ఖాన్, వెంకటేశ్వర్‌రావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

### జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

మంచిర్యాల క్రైం: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీ వన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. శనివారం కమిషనరేట్ కార్యాల యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోను స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారతదేశ నిర్మాణంలోను స్ఫూర్తివంత మైన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్‌పెక్టర్లు సతీష్, ప్రేమ్, శ్రీనివాస్, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

●మంచిర్యాల కార్పొరేషన్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. నాయకులు సుదమల్ల హరికృష్ణ, సంఘం అధ్యక్షులు గోవర్ల ఆశయ్య, బూడిద శ్యామ్, లింగయ్య, ఆత్మకూరి తిరుపతి, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు బత్తుల సుదర్శన్, రేవెళ్లి విజయ్, సబ్బని అరుణ్, అలీభాయ్, వాజిద్, గోపి పాల్గొన్నారు.

**మంచిర్యాల కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రఘునాథ్ వెరబెల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దుర్గంఅశోక్, సతీష్ రావు, రాజ్‌కుమార్, రామయ్య, రాకేష్ రేన్వా, వంశీ పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత




ద్వారకలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దండేపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ దేశ పౌరులందరి బాధ్యత అని జై బాపు జై భీం జైసంవిధాన్ పాదయాత్ర ప్రోగామ్ కో-ఆర్డినేటర్ ఇన్‌చార్జి రామగిరి భానేష్, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు అన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జైభీమ్, జైసంవధాన్ కార్యక్రమాన్ని దండేపల్లి మండలం నర్సాపూర్, మ్యాదరి పేట, మదాపూర్, దార్వక గ్రామాలోని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. అనంతరం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందు, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, కొంగల నవీన్, మాజీ సర్పంచు గాజుల లక్ష్మీనారాయణగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపెల్లి శంకర్, ఎగ్జామినేషన్ బ్రాంచ్ కో ఆర్డినేటర్ మహమ్మద్ రఫీక్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ చదువుతున్న మొదటి, మూడవ, 5వ సెమిస్టర్ విద్యార్థులు ఫీజులు మీ సేవ ద్వారా గానీ, ఇంటర్నెట్ సెంటర్ ద్వారా గాని ఆన్‌లైన్‌లో అక్టోపాడ్ ద్వారా చెల్లించాలన్నారు. వివరాలకు కళాశాల ఎగ్జామినేషన్ బ్రాంచి కోఆర్డినేటర్ నంబర్ 7013530814, 9959269975 సంప్రదించాలని కోరారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యూకేషన్ సొసైటీలో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో బట్వాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల (ఎంపీయుపీఎస్) 4వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. పాఠశాల నుంచి 8మంది ప్రవేశ పరీక్ష రాయగా అందులో ఏడుగురు మొదటి విడతల్లోనే సీట్లు సాధించారు. విద్యార్థులు గోమాస సన్విత్, ఇడిగిరాల అజయ్ కుమార్, పోగుల అద్విత్, గోమాస సహస్ర, రామటెంకి వరలక్ష్మి, దర్శనాల హైసుక, మాలోత్ శైలజ సీట్లు సాధించారు. సీట్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## వేలాలలో గిరి ప్రదక్షిణ



వేలాలలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

జైపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలాల గట్టు మల్లన్న ఆలయంలో శనివారం 6వ గిరి ప్రదక్షణను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జ్ఞాన యోగేశ్వర పీఠం సద్గురు సురేశ్వర ఆచార్య స్వామిజీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షణ చేపట్టారు. మొట్టమొదటి సారిగా గోమాలా ధారణ వేసుకున్న భక్తులు గిరి ప్రదక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ వేలాల గట్టు మల్లన్న స్వామికి ఎంతో విశిష్టత ఉందని, జిల్లాలో వేలాలలో గట్టు మల్లన్న స్వామి వెలవడం శుభసూచికమన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరు సుఖ శాంతులతో ఉండాలని గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చొప్పకట్ల శ్రీకాంత్, నగేష్, లక్ష్మణ్, ఆలయ ఈవో రమేష్ పాల్గొన్నారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు


దహెగాంలో తహసీల్దార్ కవిత, అధికారులు


బెజ్జూరులో నివాళులు అర్పిస్తున్న నాయకులు

# ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి


వాంకిడిలో..

**ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్/కెరమెరి/బెజ్జూరు/దహెగాం/వాంకిడి/కౌటాల(ఆంధ్రజ్యోతి):** జిల్లా వ్యాప్తంగా మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్ఐ పెద్దయ్య, ఆర్ఎస్సైలు రాజేష్, లవన్, సందీప్, కిరణ్, సిబ్బంది నివాళులర్పించారు. ఆయా మండలాల్లో దళిత సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కౌటాలలో..


కాగజ్‌నగర్‌లో..


కెరమెరిలో నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అధికారులు

## ట్రాక్టర్ ఢీ కొని యువకుడి మృతి

వాంకిడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి వాంకిడి మండలం నవేధరి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వాంకిడి ఏఎస్సై పోశెట్టి వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మడావి రాజ్‌కుమార్(22) వాంకిడి మండలంలోని బండకాస గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చారు. అదే రోజు సాయంత్రం 7.30 గంటలకు వాంకిడి నుంచి ద్విచక్ర వాహనం(టీఎస్ 20ఢీ 7774)పై బండకాస వైపు వెళ్తుండగా వాంకిడి మండలానికి చెందిన ట్రాక్టర్ అతి వేగంగా వస్తూ బైక్‌ను ఢీ కొట్టడంతో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వాంకిడి పోలీసులు అక్కడికి చేరుకొని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమ్రె విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## ముగ్గురు వ్యక్తుల బైండోవర్

దహెగాం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గతంలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయ కేసులో పట్టుబడిన భీమిని మండలం ఖర్జీ భీంపూర్‌కు చెందిన వడాయి సుదాకర్, వడాయి నాందేవ్, గొర్రెగుట్ట గ్రామానికిచెందిన షేక్ జమీర్‌లను శనివారం తహసీల్దార్ కవిత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయించి మరోసారి పట్టుబడితే రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

## కుట్టు మిషన్ల పంపిణీ

తిర్యాణి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలోని ఎదులపహాడ్ పంచాయతీలోని అరటిపల్లి గ్రామంలో మంచిర్యాలకు చెందిన ఔట్ రీచ్ మ్యాప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు కట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కేరోలిన్‌విగ్ మాట్లాడుతూ 22 మంది మహిళలకు అయిదు నెలల పాటు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడంతో పాటు 13 మందికి 50 శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రమోద్, లింగు, తిమోరాం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ పాలనలో రేషన్ బియ్యం దందా

### చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రేషన్ బియ్యం దందా నడిచిందని, దొడ్డు బియ్యం పంపిణీతో బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆరోపించారు. శనివారం రాత్రి మందమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను విమర్శించడం బీజేపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసినందుకు మండల పట్టణాల్లో పాదయాత్రలు చేపట్టన్నుట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. సన్నబియ్యం పథకంతో ప్రభుత్వంపై పదివేల కోట్ల రూపాయల భారం పడుతుందన్నారు. నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, లక్ష్మణ్, అర్జున్, విజయ్, జావేద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

● **ఎదుర్కోళ్ల పూజకు హాజరైన ఎమ్మెల్యే**

మందమర్రి పట్టణంలోని 1వ జోన్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ నివాసంలో శనివారం రాత్రి నిర్వహించిన సీతారాముల ఎదుర్కోళ్ల పూజా కార్యక్రమానికి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి హాజరయ్యారు. సీతారాముల విగ్రహాల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు పండితులు అందజేశారు. కార్యక్రమంలో మందమర్రి జీఎం దేవేందర్ దంపతులు, అధికారులు, ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నివాసంలో హనుమాన్ దీక్షాపరులకు భిక్ష

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎంఎల్‌సి దండే విఠల్ నివాసంలో శనివారం హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భిక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ హనుమాన్ దీక్షా ఎంతో పవిత్రమైందన్నారు. కఠిన నియమాలు పాటించంతో భక్తి భావం అందరిలో కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, హనుమాన్ మాలధారణ చేసిన స్వాములు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

## అశోక చక్రవర్తి జయంతి వేడుకలు

వాంకిడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి వేడుకలను శనివారం స్థానిక జెత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్య క్షుడు అశోక్ మహోల్‌కార్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జైరాం ఉప్రె, నాయకులు రోషన్, విజయ్, విఠల్, ప్రతాప్, మహేష్, దుర్గం ప్రశాంత్, దుర్గం శ్యాంరావు, నాగోసేన్, పాండుజీ, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ షాపులో చోరీ

రెబ్బెన, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల కేంద్రంలోని శివం మొబైల్ షాపులో శనివారం ఉదయం చోరీ జరిగినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వెనుక డోర్ నుంచి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడి కొత్త సెల్‌ఫోన్లు, వాచ్‌లు ఎత్తుకెళ్లారన్నారు. వీటి విలువ రూ.40వేల వరకు ఉంటుందన్నారు. శివం మొబైల్ షాపు యజమాని రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి వినయ్ సూచించారు. శనివారం మండలంలోని ఆర్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య పోషకహార దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషక విలువల గల ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం 27 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవిదాస్, ఏఎన్ఎం గోదావరి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

వాంకిడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని సోనాపూర్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీం, జై సంవిధాన్ అభియాన్ యాత్రలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగం మార్చే కుట్ర చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పకొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, జీవన్, గణేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువకుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

వేమనపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య అనే గిరిజన యువకుడి మృతికి కారణమైన ఇదే గ్రామానికి చెందిన ఎనగంటి చిన్నన్న అలియాస్ చిన్నారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేళ్లుగా కన్నయ్య చిన్నన్న వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పొలానికి మందు కొట్టే పంపు చెడిపోవడంతో రిపేరు ఎందుకు చేయించలేదని కన్నయ్యను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన కన్నయ్య పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సెల్‌ఫోన్ అందజేత

దహెగాం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన సిద్దం నర్సయ్యకు సెల్‌ఫోన్‌ను శనివారం ఎస్సై రాజు అందజేశారు. నర్సయ్య ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సెల్‌ఫోన్‌ను కనిపెట్టి అందజేశారు.

## యువకుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య అనే ఆదివాసీ యువకుడి మృతికి కారణమైన అగ్రవర్ణ భూస్వామి ఎనగంటి చిన్నన్నరెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మృతుని కుటుంబీకులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. కన్నయ్యను ఇష్టం వచ్చినట్లు చిన్నన్నరెడ్డి, అతని భార్య దుర్భాషలాడడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ప్రభుత్వం మృతిని కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇల్లు, మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధునయ్య, మహేష్, సాయి, సమ్మక్క, శ్యామల, ఉమారాణి, నాగజ్యోతి, సరిత, రమాదేవి, నాగమల్లు, కమల, రమేష్ పాల్గొన్నారు.

## పెన్‌గంగాలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సిర్పూర్(టి), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని టోంకిని సిద్ది హనుమాన్ ఆలయ సమీపంలోని పెన్‌గంగా నదిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికుల ద్వారా ఎస్సై కమలాకర్ సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లి పోయిందన్నారు. కేసు నమోదు చేసి అక్కడే ఖననం చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఎస్సై పేర్కొన్నారు.

## నేడు గాంధీ విగ్రహావిష్కరణ

పెంచికలపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోదండ రామాలయం ఎదుట ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్టు శ్రీరామసేవా సమితి సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా బొగ్గు నిక్షేపాలు

### - మూసివేసిన గనులను ప్రారంభిస్తే ఉపాధి అవకాశాలు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం గోదావరి పరివాహక ప్రాంతం బొగ్గు నిక్షేపాలకు కొదవ లేదని సర్వేలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో దశాబ్దం క్రితం చెన్నూరు1, 1ఏ గనులను ప్రారంభించారు. వీటితో పాటు శివలింగపురం 1 కూడా ప్రారంభించారు. ఆరు సంవత్సరాల అనంతరం నీరు అధికంగా వస్తుందని, రూఫ్ కండీషన్ సరిగా లేదనే నెపంతో మూసివేశారు. ప్రస్తుతం నాలుగు దశాబ్దాలకు సరిపడా బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని తెలుస్తోంది. అంతే కాకుండా నియోజకవర్గంలోని ఇందారం 1, 1ఏ మైన్‌లు మూడు దశాబ్దాలు నడవగా ఆ రెండు గనులను ఓసీలుగా మార్చారు. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. మందమర్రిలో ప్రస్తుతం కేకే 5 భూగర్భ గని కొనసాగుతోంది. దీనిలో బొగ్గు నిక్షేపాలు తగ్గిపోవడంతో మరో మూడు సంవత్సరాల్లో మూత పడుతుందని ప్రచారం



జరుగుతోంది. ఈ గని మూతపడితే మందమర్రి భవిష్యత్ ఏమిటని కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. గతంలో మందమర్రి మండలంలోని సారంగపల్లి వద్ద కేకే 6కు సంబం ధించి 10 సంవత్సరాల క్రితం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ గనిని ఎందుకు ప్రారంభించడం లేదో తెలియడం లేదు. అదే విధంగా ఆర్కే 1ఏ, కేకే 1 గనులను బొగ్గు నిక్షేపాలు తగ్గాయని మూసిశారు. వీటిలో బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని కార్మికులు చెబుతున్నారు. ఐదు సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ చిన్నచిన్న సాకులతో మూసివేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

● **బెల్లంపల్లి, మందమర్రి సరిహద్దుల్లో..**

బెల్లంపల్లి, మందమర్రి సరిహద్దుల్లోని శ్రావణపల్లిలో కూడా దాదాపు 50 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు బొగ్గు అన్వేషణ విభాగం సర్వేలో తేలింది. దీనికి సంబంధించి 12 సంవత్సరాల క్రితమే దీనిని ఓసీగా ఏర్పాటు చేయడం కోసం అప్పటి ఏరియా జీఎం ఆంథోని రాజా వెళ్లగా ఓసీ చేయవద్దంటూ చిత్తాపూర్, ఆవడం వాసులు అడ్డుకున్నారు. శ్రావణపల్లి ఓసీ మూలంగా జనజీవనం విధ్వంసం అవుతుందని, ఊరు విడిచి వెళ్లలేమనడంతో సర్వే పూర్తి చేసినా, భూ సేకరణకు ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక దృష్టి పెట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలోని కొత్త బ్లాకుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను ముఖ్యమంత్రితో పాటు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. చెన్నూరులో మూసిన గనులను తెరిపిస్తే ఐదు దశాబ్దాల పాటు మందమర్రి ఏరియాతో పాటు చెన్నూరుకు మంచిభవిష్యత్ ఉంటుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## గనులపై అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గనులపై అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే న్యూటెక్ గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూగర్భ, ఉపరితల గనుల్లో ఎన్నో రకాల విషవాయులు వెలువడుతాయన్నారు. వాటి నుంచి కార్మికులను కాపాడేందుకు వైద్య సిబ్బంది, అంబులెన్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వేసవికాలం దృష్ట్యా నాణ్యమైన మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కాలుష్య నివారణకు మాస్కులు, రక్షణకు హ్యాండ్‌గ్లౌజులు అందించాలని కోరారు. వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో గనులపై వైద్య సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు సింగరేణిలో మంచి గుర్తింపు

రెబ్బెన, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సింగరేణిలో మంచి గుర్తింపు ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం గోలేటి టౌన్ షిప్‌లో శ్రీ భీమన్న స్టేడియంలో ముగిసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ తరుపున క్రీడా కారులు పోటీల్లో రాణించి సింగరేణికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన వేణుగోపాల్ స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన హైదరాబాద్ జట్టుకు రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు రూ.20వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, డీజీఎంఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, డి ప్రశాంత్, ఆర్జీ-2 ఏరియా స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజీయన్స్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి




## ఎస్టీపీపీ ఈడీగా చిరంజీవి బాధ్యతల స్వీకరణ


ఈడీకి మొక్క అందించి స్వాగతం పలుకుతున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని ఎస్టీపీపీ ఈడీగా చెన్నకేశవుల చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం ఎస్టీపీపీలోని మైసమ్మ తల్లి దేవాలయంలో, సీతారామచంద్ర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈడీ చిరంజీవికి ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీలోని వివిధ డిపార్టుమెంట్ల అధికారులు, ఉద్యోగులు ఈడీకి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి మాట్లాడుతూ ఎస్టీపీపీలో పనిచేసే ప్రతీ అధికారి, ఉద్యోగి ప్లాంటు అభివృద్ధికి కృషి చేయాలని, దేశంలోని అత్యుత్తమ ప్లాంట్లలో ఎస్టీపీపీని నిలపాలని, సంస్థ, రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు జేఎన్ సింగ్, సముద్రాల శ్రీనివాస్, ప్రసాద్, మురళీధర్, అజ్మీర తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## బోరు మోటారు ఏర్పాటు

కాసిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బగూడెంలో సింగరేణి అధికారులు తాగునీటి కోసం బోరు మోటారును ఏర్పాటు చేశారు. కొంత కాలంగా దుబ్బగూడెం రామాలయం సమీపంలో, గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ నేపథ్యంలో నీటి సమస్యను స్థానికులు మందమర్రి జీఎం దేవేందర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి కొత్త బోరు మోటారును మంజూరు చేయగా శనివారం మోటారు బిగించడంతో నీటి సమస్య తీరింది.

## ఉత్తమ ప్రణాళికతో విజయం సాధ్యం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో స్థిరపడాలనుకుంటే ఉత్తమ ప్రణాళిక, శ్రమ అవసరమని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించగా, జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, కరస్పాండెంట్ ఎ రాజేశ్వర్, హెచ్ఎం సంతోష్, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ చంద్రప్రకాష్ రెడ్డి, జేసీఐ నేషనల్ ట్రైనర్ ప్రవీణ్ కుమార్, సంక్షేమాధికారి శంతన్, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు సమ్మయ్య, వాణిశ్రీ, రాజారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.

# రారండోయ్.. వేడుక చూద్దాం



## రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆలయాల్లో అన్నదానాలు

తరలిరానున్న భక్తజనం

నేడు శ్రీరామనవమి

నస్పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కోదండరామాలయాలు, శ్రీ వెంకటేశ్వర ఆలయాలు, అంజనేయస్వామి ఆలయాలల్లో రాములోరి కల్యాణ మహోత్సవ నిర్వహణకు ఆయా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాటు చేశాయి. సీతారామ కల్యాణం సందర్భంగా స్వామి వారికి తలంబ్రాలను తయారు చేస్తారు. ఆలయాల వద్ద పచ్చని పందిళ్ల, షామియానాలు, వివిధ అలంకరణలు పూర్తయ్యాయి. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళలో పుర వీధుల్లో పల్లకి సేవా కార్య క్రమాలు నిర్వహిస్తారు.

**పెళ్లి ముహూర్తం..**

శ్రీరామనవమి హిందువులకు ముఖ్యమైన పండగ. శ్రీరాముడి జన్మదినమైన చైత్రశుద్ధ నవమి నాడు దేశ వ్యాప్తంగా రాముడి పూజలు చేస్తారు. ఉదయం 11.51 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరుగనుంది.

**వడపప్పు పానకం...**

శ్రీరామ నవమి రోజున పానకం-వడపప్పుకు అధిక ప్రాధాన్యత ఉంది. నవమి రోజున పానకం- వడపప్పు తయారు చేసి మహా ప్రసాదంగా స్వీకరిస్తారు. వేసవి కాలం కాబట్టి వీటిని ప్రసాదంగా తీసుకోవడం వలన ఆరోగ్యం, ఆయుష్షు అభివృద్ధి కలుగుతుందని ఆయుర్వేద పండితులు చెబుతున్నారు. పానకం విష్ణువుకి ప్రీతిపాత్రమైనది.

### భక్తిశ్రద్ధలతో కల్యాణం

**మారుపాక ఫణి కుమార్ శర్మ- నస్పూర్ కాలనీ**



సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాల్లో, ఇళ్లలో ప్రత్యేక పూజల కార్యక్రమాలను నిర్వహిస్తారు. నవమి రోజు ఉదయమే భక్తులు తల స్నానం చేసి ఇల్లు శుభ్రం చేసుకోవాలి. గడపకు పసుపు, కుంకుమ ఇంటి ముందర రంగవల్లికలతో అలంకరించాలి. శ్రీసీతారాముల చిత్ర పటాలు, శ్రీరాముడి ప్రతిమను పూజకు ఉపయోగించవచ్చు.

**మందమర్రి టౌన్:** పట్టణంలో ఈ నెల 6న సీతారాముల కల్యాణం సందర్భంగా పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక మూడో జోన్‌లోని శ్రీ సీతారామ దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మైదానంలో భక్తులు కల్యాణం వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. మూడో జోన్ సీతారాముల ఆలయంతో పాటు పంచముఖ ఆలయానికి వేలాదిగా భక్తులు రానున్నారు. కల్యాణానికి సంబంధించిన పెండ్లి పత్రికలను పంపిణీ చేస్తున్నారు.

**దండేపల్లి:** శ్రీరామనవమిని పురస్కరించుకుని దండేపల్లి మండల పలు గ్రామాల్లో దేవాలయాలు ముస్తాబు వేశారు. కల్యాణానికి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, హనుమాన్ దీక్షపరుల అధ్వర్యంలో సౌకర్యాలు కల్పించనున్నారు.

### సీతారాములోరి పెళ్లి పాలపారక

**దండేపల్లి:** కల్యాణంలో భాగంగా శనివారం దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాలలో పాలపారక (పచ్చని పందిరి) వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు, దీక్షపరులు ఊరురా ఎడ్లబండ్లలో పచ్చని పాలపారకను ఆలయానికి తీసుకవచ్చి పందిర్లపై వేశారు.

**జన్నారం :** సీతారాముల కల్యాణానికి జన్నారం మండలంలోని రామాలయాలు శ్రీరామనవమికి ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని రామాలయం, రేండ్లగూడ, తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లోని ఆలయాల్లో పండగ సందడి మొదలైంది.

### సుద్దాల ఆలయంలో ఏర్పాట్లు..

**చెన్నూరు :** చెన్నూరు మండలంలోని సుద్దాల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయం శ్రీరామనవమికి ముస్తాబైంది. వైభవంగా రాములోరి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ప్రతి యేటా ఇక్కడ శ్రీరామనవమి పర్వదినం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఏడు రోజుల పాటు నాగవెల్లి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు.

**కాసిపేట :** నేడు మండలంలో జరగనున్న సీతారాముల కల్యాణానికి సీతారామాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. పలు ఆలయాలు చలువ పందిళ్లతో విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లను చేశారు.

**భీమారం:** మండల కేంద్రంలోని కోదండ రామాలయంతో పాటు వివిధ గ్రామాల్లో అభయాంజనేయస్వామి దేవాలయాలు శ్రీరామనవమికి ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేశారు.







నస్పూర్‌లో వేంకటేశ్వర ఆలయం వద్ద కల్యాణానికి ఏర్పాట్లు, సుద్దాలలో ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం, దండేపల్లిలో పాలపారక తీసుకొస్తున్న గ్రామస్థులు

## జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు

**కలెక్టర్ కుమార్ దీపక్**

కోటపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మండలంలోని నక్కలపల్లి, బొప్పారం గ్రామాల్లో ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మండల అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండలంలోని నక్కలపల్లి పరిధిలో రూ. 7 లక్షల డీఎంఎఫ్‌టీ, రూ. 9 లక్షల సీఎస్ఆర్, రూ. 5.5 లక్షల ఉపాధి నిధులతో సీసీ రహదారులు నిర్మిస్తున్నామన్నారు. కోటపల్లి నుంచి వేమనపల్లి వరకు రహదారి నిర్మాణంతో పాటు మండల పరిధిలోని రహదారుల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించామని అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపిస్తామన్నారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన నీటిని అందిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులకు పథకం ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్య పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

**ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి**

కన్నెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. కన్నెపల్లి మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. చర్లపల్లి గ్రామంలో రూ. 8.10 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల తరగి గదులను ప్రారంభించారు. జన్కాపూర్‌లో రూ. 20 లక్షలతో పల్లె దవాఖాణా హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 14.50 లక్షలతో పాఠశాల కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన టేకులపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 8 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అందించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, ఏసీపీ రవికుమార్, సీఐ కుమారస్వామి, ఎస్ఐ గంగారాం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వినోద్

## జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఘనంగా జయంతి వేడుకలు**



నస్పూర్‌లో నివాళులు అర్పిస్తున్న కార్మికులు

నస్పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జగ్జీవన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మున్సిపల్ వార్డు కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, నస్పూర్ అధ్యక్షుడు కొయ్యల వెంకట్, ప్రధాన కార్యదర్శి కొండ్ర లింగయ్య, నాయకులు పాల్గొన్నారు.

**తాండూర్ :** తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్, శంకర్‌గౌడ్, రాజేశం పాల్గొన్నారు.

**మందమర్రిటౌన్:** మందమర్రిలోని లెదర్ పార్కు వద్ద బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని లెదర్ పార్కు అధ్యక్షుడు కొలగూరి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్‌రామ్ విశేష సేవలందించారన్నారు. నాయకులు సంగి సంతోష్, నరేష్, రాజేష్‌కుమార్, దుర్గా ప్రసాద్, జనార్ధన్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

●పట్టణంలోని లెదర్ పార్కు వద్ద బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను లెదర్ పార్కు సాధన కమిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జన్నారం:** మండల కేంద్రంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, చంద్రయ్య, భాస్కర్‌గౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

**దండేపల్లి:** దండేపల్లిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు మండల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలమాల వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, మాల మహానాడు సంఘం అధ్యక్షుడు దయాకర్ పాల్గొన్నారు.

**కోటపల్లి :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్యలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ నవీన్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మందమర్రిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న లెదర్ పార్కు నాయకులు

**జైపూర్ :** మండలంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంతెన లక్ష్మణ్, జక్కుల వెంకటేశం, రాజన్న, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, గుండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**శ్రీరాంపూర్:** మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. నర్సింగ్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం, నస్పూర్ మున్సిపాలిటీ ప్రచార కార్యదర్శులు వాసు, విజయ్ పాల్గొన్నారు.

**భీమారం :** మండలంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదన్ బాబు జగ్జీవన్ రామ్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈపవో సతీష్ రెడ్డి, పంచాయతీ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్ :** జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీడీవో రాజేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట:** పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను సంఘ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, మాజీ అధ్యక్షుడు దొంత నర్సయ్య, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చాతరాజు రాజన్న, సభ్యులు పాల్గొన్నారు.

### అయోధ్య నుంచి పట్టు వస్త్రాలు

తాండూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్వారకాపూర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవిశ్రీరాములు అయోధ్య నుంచి శనివారం పట్టు వస్త్రాలు, ముత్యాలు, పగడాలు, తలంబ్రాలు తీసుకువచ్చి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మాజీ ఎంపీపీకి గ్రామస్తులు, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

### విద్యుత్ బ్రేకర్ ఏర్పాటు

చెన్నూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొక్కూరు 33/11కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు కొమ్మెర సెక్షన్ ఏఈ కేశెట్టి శ్రీనివాస్ తెలిపారు. రచ్చపల్లి, బీరెల్లి గ్రామాలకు కలిపి 11కేవీ బ్రేకర్ ఒకే ఉండడం, రెండు ఫీడర్‌లకు కలిపి 190 డీటీఆర్‌లు ఉండడంతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి కస్టాలను తీర్చేందుకు గాను రెండు గ్రామాల ఫీడర్‌లను వేరు చేసి రచ్చపల్లి ఫీడర్‌కు వేరుగా బ్రేకర్‌ను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేరుగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌తో విద్యుత్ అంతరయం ఏర్పడదని తెలిపారు. విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### రేషన్ షాపు వద్ద ప్రధాని ఫ్లెక్సీ

మందమర్రిరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిర్రకుంట గ్రామంలోని రేషన్ షాపు వద్ద శనివారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ కరోనా కాలం నుంచి ప్రధాని మోదీ పేదలకు ఉచితంగా 5 కిలోల బియ్యం అందిస్తున్నారని తెలిపారు. సన్నబియ్యం కోసం కేంద్రం భారీగా నిధులను విడుదల చేస్తుందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, మల్లేష్, రాము, ఉదయ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై హర్షం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ) రాజ్యసభలో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ శనివారం స్థానిక బీఎంఎస్ పార్టీ కార్యాలయం వద్ద ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర నాయకులు ఆరుముల్ల పోషం, జిల్లా నాయకులు మల్యాల రాజమల్లు, సంజీవ్‌లు, మార్త కుమార్, కట్ల తిరుపతి, రంగు శ్రీనివాస్, సదానందం, పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద ముస్లింల కోసం వక్ఫ్ సవరణ బిల్లుపై శనివారం బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల హేమాజీ, పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి, నాయకులు దుర్గం తిరుపతి, రాచర్ల సంతోష్, కోడి రమేశ్ పాల్గొన్నారు.

**కాసిపేట :** వక్ఫ్ సవరణ బిల్లుపై మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సూరం సంపత్, రెడ్డి బాలరాజు, పెద్దపల్లి శంకర్, సురేందర్, కార్తీక్, చారులత పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో సుందరకాండ హోమం

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవంలో భాగంగా సోమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో హనుమాన్ దీక్ష స్వాములు వేద పండితులతో సుందరకాండ హోమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యా అవాచణం అఖండ దీపారాధనతో ప్రారంభమై భక్తాంజనేయ స్వామి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం, పంచసూక్త హోమాలు నిర్వహించి మహా పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా హనుమాన్ స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మెర మహాదేవ్ శర్మ పాల్గొన్నారు.

### విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3న నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఓరియంటెడ్ పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు శనివారం కలెక్టర్ కుమార్ దీపక్ ల్యాప్‌టాప్‌లను అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి పుల్లూరి రిశ్వంత్ పరీక్షల్లో అత్యుత్తమంగా రాణించడంతో కలెక్టర్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ ఘనంగా సన్మానించారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్, ప్రిన్సిపల్ సంజీవ్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పంచలోహ విగ్రహాల అందజేత

వేమనపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నీల్వాయి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర శివాలయానికి వేమనపల్లి మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కు మార్ సీతారాముల కల్యాణానికి రూ. 42 వేలు విలువ గల సీతారాముల పంచలోహ విగ్రహాలను శనివారం ఆలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, నాయకులు గాలి మధు, ఒడిల రాజన్న, పూర్ణచంద్రరెడ్డి, తిరుపతిరెడ్డి, తిరుపతి, పురుషోత్తం, మధుసూదన్, దుర్గయ్య, నాగరాజు, మల్లయ్య, హనుమాన్ మాలాధారణ భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా సామూహిక యజ్ఞం

దండేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్గనూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామా సహిత దాసాంజనేయ ఆలయంలో ధ్వజస్థంభ యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఆలయంలో శనివారం మండప పూజ, సామూహిక యజ్ఞం నిర్వహించారు. పండితులు వేమునూరి వెంకట చార్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి తీర్థప్రసాదంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు.

### 'బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపేయాలి'

శ్రీరాంపూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కోల్‌బెల్ట్ డివిజన్ కమిటీ కార్యదర్శి బ్రహ్మానందం పేర్కొన్నారు. కగార్ పేరుతో అమాయక గిరిజనులు, ఆదివాసీలను చంపుతున్న విషయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ప్రజాధర్నా విజయవంతం కోరుతూ శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం పోస్టర్ విడుదల చేశారు. ప్రజాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యకర్తలు అప్పారావు, శంకర్, సమ్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

**దండేపల్లి:** మండలంలోని కోయపోచగూడ గిరిజన గూడెంలో శనివారం గిరిజనులతో కలిసి ఈనెల 8న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా సంబంధించిన వాల్ పోస్టర్లను సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏరియా కార్యదర్శి ప్రభాకర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నారి, పోచం, పోచవ్వ, పాల్గొన్నారు.

### సీసీసీలో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

నస్పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని సీసీసీ, రాజీవ్ నగర్, చేపల మార్కెట్, ప్రశాంత్ నగర్, సంఘమల్లయ్య పల్లె (2,14,15 వార్డులు)ల్లో శనివారం జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నూకల రమేష్, కోఆర్డినేటర్ అంకతి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మాజీ కౌన్సిలర్ బొయ మల్లయ్య, గెల్లు రజిత, లతో పాటు వివిధ వార్డులకు చెందిన మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం: మంచిర్యాల నగర పాలక సంస్థల్లో వేంపల్లి గ్రామంలో జైబాపు, జైభీం, జై సవిదాన్ కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. స్వాతంత్ర్య భారతదేశాన్ని కాపాడుకుందాం...రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ నినాదాలు చేశారు. గోనే సంజీవ్‌కుమార్, డేగ బాపు, ఓలపు రమేశ్, చింతపండు శ్రీనివాస్, మొగిలి తిరుపతి, పాల్గొన్నారు.

### 'సన్నబియ్యం మెజార్టీ వాటా కేంద్రానిదే'

భీమారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీలో మెజార్టీ వాటా కేంద్ర ప్రభుత్వానిదేనని బీజేపీ మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ పేర్కొన్నారు. శనివారం అంకుషాపూర్ రేషన్ షాపులోని సన్నబియ్యం పంపిణీని పరిశీలించి మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీ పథకం రాష్ట్ర ప్రభుత్వానిదే కాదని ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 10 వేల కోట్లు చెల్లిస్తుందని తెలిపారు. ప్రజలందరు దీన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బాలయ్య, శంకర్, మల్లేష్, జనార్దన్ పాల్గొన్నారు.

### ప్రతిభా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్టు ప్రతిభా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండా రపు చక్రపాణి, గుర్రాల రాజావేణు ఒక ప్రకటనలో తెలిపారు. 4, 5, 6వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరుకావాలని, 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారని, 5, 6, 7వ తరగతిలో చేర్చుకోవడానికి ఈ నెల 24న 9.30గంటలకు జిల్లా కేంద్రంలో ప్రతిభాపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9704634005 సంప్రదించాలని కోరారు.

- బస్ షెల్టర్లు లేక అవస్థలు
- మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు
- తాగునీటికి దిక్కే లేదు
- తాత్కాలిక ఏర్పాట్లయినా చేయాలంటున్న ప్రజలు



బెజ్జూరులో దుకాణాల ఎదుట నిరీక్షిస్తున్న ప్రయాణికులు

# నీడ కోసం నిరీక్షణ

బెజ్జూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుండటంతో ఎండ వేడిమికి ప్రజలు తట్టుకోలేక అల్లాడుతున్నారు. ఏప్రిల్‌లోనే భానుడు ఉగ్రరూపం దాలుస్తుండటంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాలుల ఇబ్బందులు పెడుతున్నాయి. మరోవైపు ప్రయాణికులు మండే ఎండలోనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రకరకాల చార్జీల పేరుతో ప్రయాణికుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో పదిహేను మండలాలుండగా కేవలం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల మండలాల్లో బస్టాండ్‌లు ఉండగా, మిగితా మండలాల్లో కొన్నిచోట్ల కేవలం షెల్టర్లు మా త్రమే ఉన్నాయి. బెజ్జూరు, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), దహెగాం, రెబ్బెన, కెరమెరి, తిర్యాణి వంటి మండలాల్లో బస్టాండ్‌లు లేని కారణంగా వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. పెంచికలపేటలో చిన్న షెల్టర్ మాత్రమే ఉంది. ప్రయాణికులకు నిలువ నీడ లేకపోవడంతో ఎండలోనే నిలవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. బస్సుల కోసం గం టల తరబడి రోడ్లపై, కిరాణ దుకాణాల ఎదుట, చెట్ల కింద వేచి చూడాల్సిన దుస్థితి ఉంది. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతుండటంతో ప్రయాణికులు ఎండ లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండలకేంద్రాల్లో ఆర్టీసీ అధికారులు కనీస సదుపాయాలు కల్పించకపో వడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.

### ● ఎన్నాళ్లీ దుస్థితి?

మారుమూల గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఆర్టీసీ ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ ద్వారా ప్ర భుత్వానికి కోట్ల ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పనపై శ్రద్ధచూపడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. దీనికి తోడు మండలాల్లో ప్రయాణికులకు ఎలాంటి సదుపాయాలు లేక మండుటెండలోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

### ● అధికారుల పట్టింపేదీ?

జిల్లాలోని పలు మండలాల్లో బస్టాండ్‌లు లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మండలాల్లో నుంచి నిత్యం వివిధ పనుల నిమిత్తం కాగజ్‌నగర్‌కు, కార్యాలయాల పనుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. ఈ క్రమంలో చంటి పిల్లలతో కుటుంబసభ్యులు ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో కొన్ని చోట్ల బస్టాండ్‌ల నిర్మాణం కోసం పాలకులు భూమి పూజ చేసినప్పటికి ఇప్పటికీ పనులు ప్రారంభించ లేదు. రోడ్లపై నిల్చొని ఉన్నా కనీసం తాగడానికి మంచి నీరు సైతం దొరకని పరిస్థితి తలెత్తుతోంది. వర్షాకాలంలో వర్షాలకు తడుచుకుంటూ, చలికాలంలో చలికి వణుకుతున్నారు. జిల్లాలో వివాహాల సీజన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో వివాహాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇతర గ్రామాలకు వెళ్తున్న క్రమంలో ఎలాంటి సౌకర్యాలు లేక చంటి పిల్లల తల్లులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో నిలువ నీడలేక ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు.

### ● జిల్లాలో ఇదీ పరిస్థితి...:

జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో చివరి ప్రాంతంలో ఉన్న బెజ్జూరు, చింతలమానేపల్లి, తిర్యాణి, సిర్పూర్(యు), లింగాపూర్, జైనూర్ తదితర ప్రాంతాల్లోని ప్రజలు ప్రతినిత్యం వందల సంఖ్యలో వివిధ పనులు, ఆసుపత్రులు, సామగ్రి కొనుగోలు కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో బస్టాండ్లు లేక ఎండలోనే చంటి పిల్లలతో ప్రయాణికులు గంటల తరబడి బస్సు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడి నుంచి ప్రతి రోజు పదుల సంఖ్యలో బస్సులు వచ్చి వెళ్తుంటాయి. ఆయా ప్రాంతాల్లో ఉండటానికి నీడ లేక, తాగునీరు, మూత్రశాలలు వంటి సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వారు కాలకృత్యాలకు ఎటు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారు. వేసవి కావడంతో ఎండవేడిమికి ప్రయాణికులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. బెజ్జూరు, సిర్పూర్(టి), చింతలమానేపల్లి, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, తిర్యాణి వంటి మండలాల్లో బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపైనే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సిర్పూర్(టి)లో బస్టాండ్ స్థలంలో రూ.20లక్షలతో ఇటీవల ప్రహరీ నిర్మించారు. అది కూడా అసంపూర్తిగానే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఎవరు పట్టించుకోవడం లేదు...

- చాకటి రవికుమార్, బెజ్జూరు



బస్టాండ్‌లో నీడ లేక ప్రాణం పోతోంది. చెట్ల కింద నిల్చొని కొంచెం ఊపిరి పీల్చుకుంటున్నాం. మాలాంటి వారికి చిన్న పిల్లల కోసమన్నా కూర్చోడానికి ఏర్పాట్లు చేయాలి. తాగు నీరు అందుబాటులో ఉంచాలి. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

### బస్టాండ్ నిర్మించాలి..

- రియాజ్‌అలీ, బెజ్జూరు



ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రాల్లో బస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి. ఎండ వేడిమి కారణంగా బయట ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి బస్టాండ్ ఏర్పాటు చేయాలి. మండల కేంద్రాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేని కారణంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కలెక్టరేట్‌లో బాబుజగ్జీవ్‌రామ్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు, నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, దళిత జనబాంధవుడు, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళితుల వికాసం కోసం నిర్విరామంగా కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శాలు అందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా, భారత ఉపప్రధానిగా వివిధ పదవుల్లో దేశాభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ప్రజా సంక్షేమంలో ఆదర్శాలను ఆచరణలో చూపిన మహనీయుడి చరిత్ర భావితరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా విద్యుత్ శాఖాధికారి శేషారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశవరావు, ప్రాథమిక, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబీన్ అహ్మద్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల నాగేశ్వర్‌రావు, కుల సంఘాల నాయకులు బ్రహ్మయ్య, రమేష్, శంకర్, మారుతి, జయరాజ్, గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను వెలికితీసి ఉపాధి కల్పిస్తాం

టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నాగబాల సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాల సురేష్

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక మంది కళాకారులు ఉన్నారని వారిని వెలికితీసి వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందకు సాగుతున్నట్లు టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నాగబాల సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఔత్సాహిక కళాకారులతో నిర్వహించిన సమావేశంలో దర్శకుడు దండనాయకుల మానస్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో అనేక ప్రకృతి వనరులు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకుంటూ సినిమా సీరియర్స్ షూటింగ్‌కు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 110 మంది బుల్లితెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో నవజ్యోతి సాంస్కృతిక సారథి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు రాధాకృష్ణచారి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అణగాష్టమి పూజా కార్యక్రమం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కన్యాక పరమేశ్వరి భవనంలో శనివారం అణగాష్టమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన వేద పండితుడు వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు మాట్లాడుతూ ఈ పూజ నిర్వహించటంతో లోకకల్యాణంతో పాటు ఇంటిల్లి సుఖశాంతులు కలిగి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు వంగల అన్నపూర్ణ, సెక్రెటరీ జయలక్ష్మి, క్యాషియర్ రాచర్ల రమదేవి, ఆర్యవైశ్య సంఘం మహిళ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను పెంపొందించాలి

కెరమెరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంపొందించాలని ఎంపీడీవో అంజద్‌పాషా సూచించారు. శనివారం ఆయన ఇందాపూర్, గోండ్‌గూడ గ్రామాల్లో వాటర్ షెడ్ పథకం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మల్లయ్య, ఏఈ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

సిర్పూర్(టి), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణపనుల కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉపాధిహామీ పథకంలో మంజూరైన రూ.2.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. వర్షాకాలంలో కష్టాలు తీరనున్నట్లు మండల ప్రజలు పేర్కొంటున్నారు.

## రేపటి నుంచి కందుల కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 7 నుంచి కందుల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో జైనూరు, ఆసిఫాబాద్ రెండు కొనుగోలు కేంద్రాల్లో కలిపి మొత్తం వర్షకాలం సీజన్‌లో 436 మంది రైతుల వద్ద నుంచి 2,204 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రామ్‌మోహన్

రెబ్బెన, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామ్‌మోహన్ సూచించారు. శనివారం రెబ్బెనలో సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపడానికి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సౌమ్య, నాయకులు మోడం సుదర్శన్‌గౌడ్, చిరంజీవి గౌడ్, అజయ్‌జైశ్వాల్, శ్రీధర్ పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకంతో పేదలకు మేలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సన్న బియ్యం లబ్ధిదారుడు శంకర్ ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్‌తివారీ, డేవిడ్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన సన్న బియ్యం పథకం వారికి ఎంతో మేలు చేస్తుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆసిఫాబాద్ మండలం ఆర్ఆర్ కాలనీలోని సన్నబియ్యం లబ్ధిదారుడు శంకర్ ఇంట్లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ శనివారం భోజనం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. లబ్ధిదారుడికి తెలుగు రాకపోవడంతో ఆయన మాతృభాష మరాఠీలో ముచ్చటించారు. లబ్ధిదారుడి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ సన్నబియ్యం పథకంలో పేదలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి రోజు దళిత కుటుంబంలో భోజనాలు చేయడం మర్చిపోలేనని అన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఆర్ఐ రహమత్, నాయకులు శంకర్ ఉన్నారు.

## సీతారాముల కల్యాణానికి ఆలయాల ముస్తాబు



ఆసిఫాబాద్‌లో విద్యుత్ దీపాలతో అంకరించిన కోదండరామాలయం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం 11.59 గంటలకు పునర్వసు నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న సుముహుర్తంన జరుగనున్న సీతారాముల కల్యాణ వేడుకకు వేలాదిగా భక్తులు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ గ్రామంలోని కోదండరామాలయానికి తరలి రానున్నారు. మూడు రోజులుగా ఆలయం వద్ద నిర్వాహకులు కల్యాణ వేడుకకు సంబంధించి పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. శనివారం ఆలయం వద్ద పందిర్లు వేసి పాలపొరక కార్యక్రమాన్ని చేపట్టారు. కోదండరామాలయంలోని సీతారామలక్ష్మణ హనుమాన్ సమేత గర్భగుడితో పాటు శివాలయం, సాయిమందిర్‌ను పూలతో అత్యంత వైభవంగా అలంకరించారు. దీంతో పాటు ఆలయం ఆవరణలో కల్యాణ మండపాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం 4 గంటలకు స్వామి వారి సుప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలు పెడతామని ఆలయ అర్చకుడు వినాయక శర్మ తెలిపారు.

**కౌటాల (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కోదండరామాలయం సీతారాముల కల్యాణానికి ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం మండలంలోని తుమ్మిడిహెట్టి పుష్కరఘాట్ వద్ద తెప్పోత్సవం, కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

పెంచికలపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతపల్లి గ్రామ శివారులో పంట పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. యాసంగి వరి పంట కోత దశకు చేరుకుంది. కానీ విద్యుత్ తీగలు చేతికి తగిలే ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో వరి కోత యంత్రం పొలాల్లోకి రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విద్యుత్ శాఖాధికారులకు పలు మార్లు విన్నవించినా సమస్య స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## జోరుగా ఉపాధి హామీ పనులు

దహెగాం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలోని చింతలపాటి చెరుడులో జాతీయ ఉపాధి హామి పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువులో చేపల కుంట పనులను మండుటెండను సైతం లెక్క చేయకుండా చేపడుతున్నారు. వేసవి కాలంలో వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో కూలీలు ఉపాధి హామి పనికి తరలి వెళ్తున్నారు. ఉపాధి పనుల వద్ద కనీస వసతులైన నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స బాక్కులు ఎలాంటివి ఏర్పాట్లు చేయడం లేదు. కూలీల హాజరు సమయంలో చెరువు కట్టపై ఉన్న చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి ఉపాధి హామి పనుల వద్ద కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.



చింతలపాటి చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

## శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనం



ప్రమాదకరంగా మారిన పాత పాఠశాల భవనం

సిర్పూర్(టి), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ పాఠశాలలో పురాతన కాలం నుంచి ఉన్న పాత భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. 1984 సంవత్సరంలో అప్పటి సిర్పూర్ సమితి అధ్యక్షుడు ఎం భిక్షపతి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పాఠశాల భవనం నిర్మించి 41 సంవత్సరాలు గడవగా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అయినప్పటికీ అధికారులు కూల్చి వేసేందుకు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ భవనాలు ఇలాగే ఉంటే విద్యార్థులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇదే పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ భవనం కూడా శిథిలావస్థకు చేరింది.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెంచికలపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొమురయ్య సూచించారు. శుక్రవారం రాత్రి ఎర్రగుంట గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాజాతా బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 100 డయల్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. గుడుంబా, మద్యం గ్రామాల్లో విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, ఫోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొమురయ్య